# రాధ నవ్వింది

రాధ నవ్వింది. ఆ నవ్వులో నవరత్నాలూ రాలినయి. నా ఆశాజ్యోతులు ఆరిపోయినయి.

రాధ అందమైన స్త్రీ కాకపోయినా ఆమెలో గొప్ప ఆకర్షణ వుంది. ఆమె తన లోతైనకళ్లతో ఏమనిషివంకైనా దీర్ఘంగా చూసిందంటే, అతనికి ఆ దృష్టుల్లోని భావానార్థం యావజ్జీవసమస్యగా ఏర్పడుతుంది.

రాధ తన్ను నేను ప్రేమించేటట్టు చేసుకుంది. ఆమెమీద నాకు కలిగిన మమకారానికి కారణం ఆమె నాకిచ్చిన చనువే! అర్థించకుండానే అవసరమైనంత చనువూ ఇచ్చి —తీరా— "నేను నిన్ను ప్రేమిస్తున్నాను, రాధా" అనేసరికి వికటంగా నవ్వింది.

ఆ నవ్వులోనే నవరత్నాలూ వొలికినయి. ఆ నవ్వుతోనే ఆశాజ్యోతులు అంధకారంలో లీనమయిపోయాయి.

రాధ విడ్డూరంగా నవ్వుతూ అడిగింది. ఆనంద్, ప్రేమ అంటే ఎట్లా ఉంటుంది? నల్లగా వుంటుందా, తెల్లగా వుంటుందా? ఘనపదార్థమా, ద్రవపదార్థమా? ఆకాశంమీద వున్న నక్షత్రాలలో వుంటుందా, మురికికాలవలో వున్న దోమలలో వుంటుందా? ఎక్కడ వుంటుందోయ్, నువ్వు సీసమాలికలలోనూ శార్దూలాలలోనూ పొగిడే ఆవస్తువ?"

ఆమెగాజులు గలగలమన్నాయి. ఆగలగల నా హృద యంలో కలవరం కలిగించింది.

ఆమె నన్ను వేళాకోళం చేస్తోంది. ఆమెకు అంత వరకూ నామీదవున్న గౌరవం ఒక్క వాక్యం వినేసరికి మటుమాయమైపోయిందా?

"ఎక్కడ వుంటుందోయ్, ఆనంద్, ప్రేమ? కవుల కల్పనలో తప్ప ఎక్కడవుంది? సానుభూతి అయినా చూపించలేని నిర్దాక్షిణ్యప్రపంచంలో ప్రేమ అనేది ఒకటి వుందని భ్రమించేదాన్ని. "ప్రేమ" అనే ఆ నిస్సారమైన పదంలో ఎంత కుట్రవుందో, ఒక్కొక్క అనుభవమూ నాకు విస్పష్టంగా బోధించింది. అనుభవాలు నన్ను మోసం చెయ్యలేవు. నేను చూపుతున్న గౌరవంతో తృప్తిపొందక, ప్రేమ అనే అస్త్రాన్ని ప్రయోగించి నాలో అయిక్యమయి పోదామని అభిలషించకు."

నిజంగా ప్రేమఅనేది లేనే లేదా? ప్రతి అంగుళమూ స్వార్థంతో నిండిపోయిన యీకల్మషప్రపంచం నిర్మలమని భావిస్తూ, "ప్రేమ" ని కల్పిస్తున్నాడా కవి? పాపం బహుశా - అనుభవాలన్నీ ఆమె సున్నిత హృదయం సమ్మెటపోటులలా తగిలాయేమో!

సహజంగా-పురుషుడు తను వాంఛిస్తున్న స్త్రీ తన్ను నిరాకరిస్తే ఆమెని నరికేసి ముక్కలుకింద చేసి అయినా కసి తీర్చుకుందామనే పశుప్రయత్నం చేస్తాడు. ఏప్రకారం సాధ్యమైతే ఆప్రకారంగా ఆమెని వంచిద్దామని దృఢనిశ్చ

యుడౌతాడు. ఆమాదిరి అహంకారం ఎందుచేతనో, నాలో జనించలేదు. ఆమె నన్ను ఎగతాళిచేస్తోందని మొట్టమొదట కొంచెంగా చిన్నబుచ్చుకున్నాను.

నాలుగు సంవత్సరాలకి పూర్వం గాలిలోని ఎండుటాకు వలెవున్న ఆ అభాగినికి విశ్వనాథం ఎంతో దయార్ద్రహృదయంతో ఆశ్రయమిచ్చాడు. అనుభవాలు ఆమెను ఎలా మోసం చెయ్యలేవో, అలాగే విశ్వనాథాన్ని మోసంచెయ్యడానికి ఆమెకి సుతరామూ యిష్టంలేదేమో!

నన్ను ప్రేమించడం విశ్వనాథాన్ని మోసం చెయ్యడమా? స్త్రీ ఒకర్ని ప్రేమించడం యింకొకరిని మోసం చెయ్యడమేనా? యిది ఒక అసందర్భపుగోల. ముడివిడని సమస్య.

"రాధా, ప్రపంచంమీద విశ్వాసం నశించి, నువ్వు ఇలా అంటున్నావ్! అధర్మమూ, అరాజకమూ, అన్యాయమూ లోకాన్ని పాలించలేవు. ఉన్నతపథాన్ని ప్రపంచం సర్వదా ప్రసాదిస్తూనే వుంటుంది. ముందుకి సాగిపోవడమో అధఃపతనమై పోవడమో మానవుని ప్రయత్నంలో వుంటుంది. నీసంపర్కాన్ని పొందినవారు నీ పతనానికి కారణభూతులయారేమో! నీకు సరిఅయిన స్థానం యిచ్చి నీలోని ఔన్నత్యాన్ని పెంపొందించ లేకపోయారేమో!" అని కాలేజీ డిబేటింగు సొసైటీలో మాట్లాడినట్టు మాట్లాడాను.

"నువ్వు నన్ను గొప్పదాన్ని చేస్తావుకదూ!" అంటూ నా వీపుమీద చరిచి ఫక్కున నవ్వింది.

నిష్కల్మషమైన ఆమెనవ్వుకి చక్కని పలువరస ఒక ఆభరణం.

సాయంత్రం నాలుగున్నర అయింది. విశ్వనాథంఆఫీసు నుంచి వచ్చేందుకు యింకో గంట వ్యవధి వుంది. స్వత స్సిద్ధంగా విశ్వనాథం ఎవర్నిగురించీ నీచంగా అనుమాన పడే మనిషి కాదు. ఆరునెలలకి పూర్వం రాధకీ, నాకూ పరిచయం కలగచేసింది ఆయనే. కాని, ఎంచేతనో ఆనాడు అతని మొహం చూడడం నాకు మనస్కరించలేదు. నమ్మిన స్నేహితుడిభార్యను లోబరచుకోందామనే ప్రయ త్నం చేస్తున్నాను. నీతి, భయం నా హృదయాన్ని బాధ పెట్టిందేమో!

"రాధా, వెళ్తాను."

"మళ్ళీ ఎప్పుడు రావడం?"

"నీ సెలవు ఎప్పుడు అయితే అప్పుడు."

ఆమె తన నవ్వును పైటకొంగుతో ఆపుచేసుకుంది.

"వెళ్ళాలి. ఇంకా యితర పనులున్నాయి." అని అన్నాను,—నిజానికి ఏయితరపనులూ లేకపోయినా.

"కోపమా?" అని అడిగింది రాధ, కొంటెతనంగా.

నవ్వాను. అవును—ఏడవలేక నవ్వాను. ఆ ప్రకారం బాధపెట్టడం స్త్రీకి సరదా ఏమో!

ఆమె తన గుండ్రటికళ్ళతో నన్ను అవలోకించింది. ఆ వీక్షణబాణాలు నాగుండెను రాసుకుపోయి గాయపరచినై.

"రాధా, నన్ను వేధించకు."

"ఆనంద్, నీది నిర్మలమైన మనస్సు. నువ్వు పవిత్ర హృదయుడివి. నీ అనురాగానికి నేను తగను. అంచేతనే తిరస్కరిస్తున్నాను."

నిజమా ? పన్నుగడా ?

"నన్ను ఏడిపిస్తున్నావ్!" అని అన్నాను విసుగెత్తి.

"ఏడవకు నాయనా," అంటూ చెంపమీద చిన్నదెబ్బ కొట్టింది.

బ్రహ్మ యీ ప్రపంచంలోని అవకతవకలన్నీ, ఏర్చి కూర్చి స్త్రీమూర్తిని సృష్టించాడా అని మనస్సులో తర్కించుకుంటూ యింటిదారి పట్టాను.

బీచిలో పడుకొన్నాను. రాత్రి పదిన్నర దాటుతుంది. దశమిచంద్రుడు పిల్లకెరటాలకి అందమైన కాంతిని ఇవ్వగా అవి వుల్లాసంతో అల్లల్లాడుతూ నన్ను చూసే కాబోలు నవ్వుతున్నాయి. సిజర్‌కన్య నాకు శరణం కాగా, యిసుకలో పడుకుని, గగనవీధిలో లక్షలాదిగావున్న నక్షత్రాల్నీ, విశ్వనాధాన్నీ, రాధనీ, నన్నూ, రాజకీయవేత్తలతోనూ మతోద్ధారకులతోనూ, నిండిపోయిన యీప్రపంచాన్నీ తన లీలాభూమిగా సృష్టించుకోవడంలో భగవంతుని ఉద్దేశ్యం ఏమిటా అని ఆలోచిస్తున్నాను.

ఆ ఆలోచనకి ఆదీలేదు, తుదీలేదు. ఆకాశంవేపు చూడడమే పనిగా ఏర్పరచుకున్న నేను కొద్దిసేపు విచా

రించాను. ఎందుకా? నక్షత్రశాస్త్రం చదువుకోలేదే అని. సప్తరుషిమండలం ఎక్కడా అని వెతికాను. కనిపించ లేదు. ఆవులిస్తూ అరుంధతికోసం ఆకాశం అంతా గాలిం చాను. కనిపిస్తేనా? ధృవనక్షత్రంకోసం దూకుడుగా వెతి కాను. ఎక్కడ వుంటుందో తెలిస్తేనా? నా అజ్ఞానాన్ని నేను నిందించుకొన్నాను. కాని, ఏం లాభం, అన్నీ వ్యర్థ ప్రయత్నాలేకదా. ఆకాశంమీద నక్షత్రాల్ని గుర్తించడానికి చేసిన ప్రయత్నాల్లాంటి వేనా, ఈ జీవితంలోవి నా ప్రయ త్నాలన్నీ.

స్వతస్సిద్ధంగా స్త్రీ పురుషుడికి చక్కటి సమస్య. రాధ నాకు కమ్మటి సమస్య. ఆమెగురించి ఆలోచిస్తూవుంటే నైట్‌క్వీన్ వాసన ఆఘ్రాణిస్తున్నట్లుగా వుంటుంది.

ఆమెసమక్షంలో వున్నప్పుడు, అమృతం తాగినట్లు కళ్ళతో ఆమెఅందాన్ని తాగెయ్యడమే నా పని. ఆమె కొంటెతనంగా ఏదో దుడుసు మాట అనేదాకా ఆ దాహం తీరదు.

రాధ ఎవరో, కులగోత్రాలు ఏమిటో, ఎక్కణ్నుంచి వూడిపడిందో, తలిదండ్రులెవరో, నాకెంత తెలుసో, దారిని పోయే అపరిచితుడి కెంత తెలుసో, విశ్వనాథానికీ అంతే తెలుసు. విశ్వనాథం దగ్గరికి రాకపూర్వం ఆపక్షి ఎన్ని కొమ్మలమీద వాలిందో ఏనరుడికీ తెలీదు. నాలుగు సంవత్స రాలకిపూర్వం ఆ పక్షి ఒకకొమ్మని ఆశ్రయంగా చేసుకొని.

ఒక గూడుకట్టుకొని, స్థిరవాసం ఏర్పరచుకుని, చీకూ చింతా లేకుండా కాపరం చేస్తోంది.

రెక్కలు కట్టుగు గాలిలో విహరించే రంగు రంగుల పక్షి గూటిలో ఎందుకు బందీ అయిపోయిందో ఆ మెహృదయానికే తెలియాలి. బహుశా— తుపానుగాలిలో తడిసి ముద్ద అయిపోకుండా సూ, మండుటెండలో మల మల మాడిపోకుండా సూ, తనశరీరాన్నీ, మనస్సునీ జాగ్రత్తగా రక్షించుకునేటందుకు ఒక గూడు అవసరమని అనుభవాలు ఆమెకి నివేదించినాయేమో!

విశ్వనాథానికీ రాధకీ ఎలా జతకుదిరిందో తెలీదు కాని విశ్వనాథం మద్రాసులో మకాం పెట్టినప్పట్నుంచీ సంఘము ప్రజలూ శ్రీమతి రాధాదేవి విశ్వనాథం ఎం. ఏ. గారి భార్య అని పరిగణిస్తున్నారు. నిజానికి రాధ చాలా యోగ్యురాలు. విశ్వనాథం ఎంతో ఓర్పుగలవాడు.

ఇలా ఏమిటో ఆలోచిస్తున్నాను. మైకం కమ్మింది. కళ్లు మూతలు పడినై. సుషుప్తి వస్త్రంలో మునిగిపోయాను.

కళ్లు తెరిచేటప్పటికి దశమి చంద్రుడు కనపడలేదు..లోకమంతా అంధకారంలో మునిగివుంది. అంధకారాన్ని రూపుమాపగల శక్తి తమలో లేదని తెలిసికూడా నక్షత్రాలు జిగ్ జిగ్ కాంతులు ప్రసరిస్తున్నాయి. నలకూబరుడికోసం విలపించే రంభలా సముద్రం ఘోష పెడుతోంది. ఇసుకలో పరున్నవాణ్ణి లేచి యిసుక దులుపుకుంటూ యింటిదారి పట్టాను.

మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకి విశ్వనాధం నన్ను రమ్మని కబురుచేశాడు. ఎందుకై వుంటుందా అని ఆలోచిస్తూ బయటుదేరాను.

విశ్వనాధం హాల్లో పచార్లు చేస్తున్నాడు. గళ్ళలుంగీ చేతులులేని బనీనూ ధరించాడు.

"ఎందుకు కబురంపించావ్ ?" అని అడిగాను. విశ్వనాధానికీ నాకూ యివ్వాళటి పరిచయమా ? మా యిద్దరి స్నేహానికీ ఒక్క-పుష్కరం ఆయుర్దాయం ఉంది.

"కూచో" అంటూ కుర్చీ చూపించాడు. తను కూడా యింకో కుర్చీలో కూలబడ్డాడు.

అతను కేకేశాడు. "రాధా"

"వోయ్!" అంటె. యింట్లోంచి కఠోరంగా వుంది జవాబు. తేనెచిలుక్క-ల్లాంటి పలుక్క-లే రాధవి ! ఈమొర్రటు, తనం ఎందుకు వచ్చిందో కంఠంలో !

"ఎందుకు పిలిచారు ?" అని అడిగింది హాలులోకివచ్చి.

"ఆనంద్‌కు, నాకు కాఫీ తెచ్చిపెట్టు !" అని విశ్వనాధం అన్నాడు చిన్నగా నవ్వుతూ. ఎంత తీవ్రసమస్య మనసుని బాధపెడుతున్నా, తేలికగా ప్రవర్తించగల సామర్ధ్యం విశ్వనాధానికి వుంది.

రాధ రెండుకప్పులలోనూ కాఫీ పోసి రెండుకుర్చీల మధ్యవున్న టీపాయిమీద పెట్టింది.

ఆమె పెడుతూవుండగా విశ్వనాధం అన్నాడు. మన రాధ సినీమాస్టార్ అవుతుందోయ్ !

"ఎప్పుడు ?" ఆశ్చర్యంగా అడిగాను.

రాధ యిద్దర్నీ ఉద్దేశిస్తూ రోషంగా అంది. "మీ సెలవు ఎప్పుడు అయితే అప్పుడు." ఆమాటలు అంటున్నప్పుడు ఆమెకనుబొమ్మలమీద జయకాళి నృత్యం చేసింది.

"ఎవరో శంకర్రావట ! కొత్తగాఫిల్మ్ కంపెనీ పెడుతున్నాడట. మనరాధకినెలకు అయిదువందలు జీతం. సంవత్సరం కంట్రాక్టు. నాలుగునెలల జీతం అంటే రెండువేలరూపాయలు అడ్వాన్సుగా యిస్తాడట!" విశ్వనాథం చెప్పాడు. చెప్పి రాధ మొహంవంక తేరిపార చూశాడు.

"అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనివాడు మూర్ఖులు." రాధ నీతులు నేర్పుతోంది ప్రపంచానికి :

"ఆనంద్, నిన్న రాత్రినుంచి యిదో పోరు. నువ్వు బోధించు ఏమైనా వింటుందేమో ! నాతో కాపరంచేస్తూ ఫిల్ములలో నటించడం నేను సహించలేను. ఆమె అవ్వా కావాలి, బువ్వాకావాలి - అంటుంది. నాకు కావలిసివస్తే, అడ్వాన్సుగా తనుపుచ్చుకునే రెండువేలు నాకే యిచ్చేస్తుందట....పిచ్చిపిల్ల....పట్టి అమాయిక." భార్యగురించి భర్త ఎప్పుడూ అలా అనుకుంటాడు కాబోలు.

రాధ చురచుర చూసింది. రాధ అమాయికా ? పిచ్చి పిల్లా ?

"కాసేపు నువ్వు బోధించు. నాకు చైనాబజారులో పని వుంది. ఒకగంటలో తిరిగి వస్తాను." అంటూ బట్టలు మార్చుకుని వీధిలోకి నడిచాడు విశ్వనాథం.

"బోధిస్తాడు. బోధించాలి ప్రేమఅంటే ఎంత పుత్కృష్ట మైనదో, ఎంత మహత్తరమైనదో విరహగీతాలతో సహా!" అని నిందాగర్భంగా పలుకుతూ, మందహాసంచేస్తూ, కాఫీ కప్పులు యింట్లో పెట్టేందుకు వంటగదిలోకి నడిచిందిరాధ. గొప్ప తార కాగలిగిన గుణాలు నిజంగా ఆమెలోవున్నాయి. అర్ధనిముషంలో ముఖంలోని తీవ్రత మారిపోయి, దాని స్థానే మందహాసం.

మూడునిముషాల్లో మళ్ళీ సావిట్లోకి వచ్చింది. ముఖాన్ని వున్న కుంకుమబొట్టు అద్దంలోచూసి దిద్దుకుంటూ.

"ఊ....ఏమంటావ్...." అంటూ ధీమాతో సంభాషణ ప్రారంభిస్తూ విశ్వనాథం ఖాళీచేసిన కుర్చీలో దర్జాగా కూచుంది.

"ఏమీ అనను."

"సినీమాస్టార్ అవమంటావా ?"

"నీ యిష్టం. నేను చెప్పినవన్నీ విన్నావా, యివి వినేందుకు ?"

"ఇదిగో ఎప్పుడూ ఆ గొడవేనా ? ఈయింట్లోఉన్నంత కాలమూ, విశ్వనాథం సొమ్ము తింటున్నంత కాలమూనేను ఎట్టి నీచానికీ పాల్పడను. స్త్రీపురుష సంపర్కాన్ని నువ్వు రత్నహారాలలాటి పదసమూహంతో వర్ణించినా నేను మోస పోను. నీయౌవనోద్వేగం దానికి ఆమహత్తును కలిగి స్తోంది. స్వార్ధపరత్వం కూడిన వాంఛకి మీరందరూ "ప్రేమ" అనే బూటకపు పేరు వాడుతున్నారు. దానిలో

వున్నదంతా కల్మషమే. పైకి పవిత్రత పెద్దమనిషి తరహాగా నటిస్తారు. నాలుగుసంవత్సరాలు గడచిన తర్వాత, నువ్వు యింకో స్త్రీని ఫెండ్లాడి ఆమెతో సర్వసౌఖ్యాలూ అనుభవించినతరువాత యింత తీవ్రమైన వాంఛతో నువ్వు నన్ను కోరుతావా ?"

రాధ యింకా ఏమిటో మాట్లాడబోయింది. నేను అడ్డు తగిలాను.

"కోరుతాను."

పొరబాటేమో ! కోరనేమో !

ఆమె లతాతన్వి అబల మొదలైనవికాదు. ప్రాక్టికల్ మనిషి. అనుభవంగల ఆడది.

రాధ ఢంకా బజాయించి చెప్పినట్టుగా అంది." కోరవు. నువ్వే ఓడిపోతావ్."

ఓడిపోతానా ? సాధ్యమా ? అయితే యీ బాధంతా ఎందుకిప్పుడు ?

"నేను ఫిల్ములోకి వెళ్తాను."

"మరి విశ్వనాధం విషయమో !"

"విశ్వనాధంగారు నాకుచేసిన ఉపకారానికీ, నాకుఇచ్చిన గౌరవానికీ, నాకు ప్రసాదించిన స్థానానికీ నేను ఆయనకి ఆజన్మాంతమూ కృతజ్ఞురాలినై వుండవలసినబాధ్యత నాలో ఉంది. నేనేమీ అన్యథా ప్రవర్తించలేదు. ప్రవర్తించను. కృతజ్ఞురాలనై వుండవలసిన బాధ్యత నాలో వుంది. గనక, నామీద అధికారం చెలాయిస్తూ నా అభ్యుదయానికి అడ్డు

తగలడం నేను సహించలేను. నాలుగుసంవత్సరాల సహచర్యంలో ఆయన నన్ను బాగా అర్థం చేసుకోగలిగి ఉంటారు. నేను ఫిల్ములలో నటించడంవల్ల ఆయన కెట్టి అప్రతిష్టకాని, ఉపద్రవంగాని రాలేదని నేను రూఢిగా విశ్వసిస్తున్నాను."

"ఇంకా ?...."వేళాకోళంగా అన్నాను.

"నవ్వకు. నేను చెప్పే వాట్లో అసత్యం లేదు. నువ్వు కూడా ఆయనకి బోధించి చెప్పు."

"నన్ను నువ్వు ప్రేమించకపోయిన తర్వాత, నేను ఈశ్రమఅంతా పడడంవల్ల ప్రయోజనం ఏమిటి ?"

"నువ్వు పదేపదే ఆ మాట అనకు. నువ్వు నన్ను ప్రేమిస్తే నాకు చాలా బాధగానూ జాలిగానూ ఉంటుంది."

నిజమా ? బాధ ఎందుకు ?

నేను ఆమెని ప్రశ్నించాను.

"ఎంచేత ?"

"నీ ప్రేమకి నే నసర్హురాలను. మలినమైపోయిన ఈశరీరమూ ముసలిదైపోతున్న ఈహృదయమూ నీ కెందుకు?"

అబ్బ! యిన్నాళ్లకి ఆమె హృదయకుహరంలో నుంచి వెలువడ్డాయి ఆ పల్కులు. ఆమెదృష్టులలో ఎంత ఆకర్షణ ఉందో హృదయంలో కూడా అంత గంభీరత ఉందని తెలుసుకోగలిగాను.

మర్నాడు మధ్యాహ్నం విశ్వనాథాన్ని వప్పించేటప్పటికి నా పెద్దలు దిగివచ్చారు. అతికష్టంమీద రాధ సినీమాస్టార్

అవడానికి వప్పుకున్నాడు.

రాధ అందని మానిపండని నేను నిరాశ చేసుకున్నాను. ఇంకా కొన్నికారణాలవల్ల మద్రాసునుంచి నా మకాం ఎత్తి వేయాలిసొచ్చింది.

జీవన్నాటకంలో నాలుగుసంవత్సరాలు గడచిపై. యీ లోగా రాధా నేనూ ఒక్కమారుకూడా కలుసుకోలేదు. రాధా, విశ్వనాధమూ ఆమె స్టార్ అయిన మూడో సంవత్సరంలో వివాదపడ్డారనీ, విశ్వనాధం ఆమెని వదిలేశాడని విన్నాను. రాధజీవితనాటిక విషాదాంతమవుతుందేమోనని జాలిపడ్డాను.

నావిప్లవభావాలూ కవితావిహారమూ, స్వేచ్ఛావాసనలూ సాంప్రదాయానికి జోహారులిచ్చాయి. నాకూ్కడా వివాహం అయిపోయింది. ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని సిద్ధాంతీక రించినవాణ్ణి, పెళ్ళిచేసుకుని ప్రేమించడం నేర్చుకునే ప్రయత్నాలు చెయ్యడం ఆరంభించాను. ఆప్రయత్నాలలో సఫలత వున్నా లేకపోయినా విధిని నిందిస్తూ ముందుకుసాగిపోయే మానసిక దౌర్బల్యం కూడా నన్నావరించేసింది.

ఒక క్రిష్టమస్‌కి మద్రాసు వెళ్ళాను. ప్రపంచవిఖ్యాత నటుడూ హాస్యరసికాగ్రేసరుడూ అయిన చార్లీచాప్లిన్ నటించిన "మోడరన్ టైమ్స్" మినర్వాలో చూస్తున్నాను.

అది మొదటి ఆట. యింటర్వెల్ అయింది. జేబురుమాలులో మొహం తుడుచుకుంటున్నాను. గాజులుగంతులేస్తున్న ధ్వని నాచెవులదగ్గిర చిందులాడింది.

వెనక్కి తిరిగి చూతునుగదా ఆమె రాధ. పూర్తిగా మారిపోయిన రాధ.

సినీమా అయిపోయినతర్వాత బలవంతంమీద నేను రాధ యింటికి వెళ్లాను. నాకు వెళ్దామనే ఆసక్తిగాని కుతూహలంగాని ఎంతమాత్రం లేకపోయినా ఆమెని తిరస్కరించగల సాహసం నాలో లోపించింది.

తన స్వంతకారులో తీసుకువెళ్లింది. కుశలప్రశ్నలూ సాధారణ అసాధారణ విషయాలూ కారులో మాట్లాడుకున్నాం.

ఇప్పుడు రాధ సామాన్యస్త్రీ కాదు. సుప్రసిద్ధ తార. విమర్శకులూ, ఎడిటర్లూ, ప్రొడ్యూసర్లూ, ప్రజలూ ఆమెకి తారామండలంలో ఒకస్థానం ఏర్పరిచారు.

అయినా యిప్పటిరాధలో మునుపటి ఆకర్షణ నాకు కనిపించడంలేదు. ఆ లోపం నామనస్సులో వుందా? ఆమెలో వుందా? అనంతమయిన ఈకాలంలో వుండా?

అందమయిన భవనంముందు కారు ఆగింది. లోనికి నడిచాం.

హాలులో ఒకపెద్దమనిషి రాధ రాకకోసం నిరీక్షిస్తూ కూచున్నాడు. రాధ రాగానే లేచి నుంచున్నాడు.

రాధ నాకాయనతో పరిచయం కలుగజేసింది. ఆయన తను నటించబోయే మరుసటిచిత్రానికి డైరక్టరట. ఆఫిల్మ నిర్మాత నాతో తెలుగుఫిల్ముల గురించిన విషయాలు ఎన్నో

మాట్లాడాడు. మాట్లాడుతున్నాడేగాని ఆ కళ్ళలో అను క్షణమూ ఈర్ష్య ప్రతిబింబిస్తూనే వుంది.

"ఈయన బాల్య స్నేహితుడు. మేము కలుసుకుని నాలుగు సంవత్సరాలైంది. తలవనితలంపుగా యీవాళ కలుసుకున్నాం. మరుసటి ఫిల్ముగురించిన వివరాలు రేపు సాయంత్రం నాలిగింటికి ఆఫీసులో మాట్లాడుకుందాం" అని అంది రాధ డైరక్టరుతో.

ఆతృత నటిస్తూ ఆ పెద్దమనిషి సెలవు పుచ్చుకున్నాడు.

మేడమెట్లు ఎక్కాం. ఆమె రాసుకు రాసుకునడుస్తోంది. ప్రయత్నపూర్వకంగా తనశరీరాన్ని నా శరీరానికి తాకిస్తోంది. నాలుగుసంవత్సరాలకి పూర్వం ఏస్పర్శకోసం దేవుళ్లాడానో, ఆస్పర్శలో యీనాడు ఎట్టి మాధుర్యమూ లేదు సరిగదా కాఠిన్యత కనిపిస్తోంది.

ఇద్దరమూ సోఫాలో కూచున్నాం. "వేడినీళ్లు ఉన్నాయి, స్నానం చేస్తావా ?" అని అడిగింది. చెయ్యనన్నాను. ఐదు నిమిషాల్లో వస్తానని స్నానానికి వెళ్ళింది. స్నానం చేసి, తెల్లటి సిల్కుచీర ధరించి, నేను కూచున్నచోటికివచ్చింది. ఆమె చెవులని వున్న రవ్వలలోలకులు ఎలక్ట్రిక్ దీపాల వెలుతురికి ధగధగ మెరుస్తూ నన్ను ఆశానిరాశల మధ్య ఊగులాడిస్తున్నాయి. ఆశ ఎందుకో, దాన్ని వెంటాడే నిరాశ ఎందుకో !

ఇద్దరమూ భోంచేస్తున్నాం.

"నువ్వు మారిపోయావు."

"నువ్వూ మారిపోయావు." అంటూ నా మాటలు నాకు వప్పజెప్పింది.

"నాకు పెళ్ళి అయింది."

"నన్ను మొగుడు వదిలేశాడు."

ఇద్దరమూ నవ్వు తెచ్చిపెట్టుకుని నవ్వాం.

భోజనం అయిపోయింది. తిరిగీ సోఫాలో కూచున్నాం. ఆమె తమలపాకులు చీలుస్తోంది. చీల్చి, చిలకలుగా చుట్టి నాకు అందిస్తోంది. ఒక్కొక్కటే నములుతున్నాను.

"ఇలా వళ్ళో పడుకో!" అంటూ తల తన రెండు చేతులతోనూ పట్టుకుని తనవళ్లో పడుకోబెట్టుకుంది. నావళ్లు జలదరించింది. ఇష్టంతో నిమిత్తంలేకుండా ఆమెశక్తికి లోబడిపోయాను.

అత్తమామలకి సపర్యలు చేసి, వంటయిల్లు చక్కబెట్టుకొని, పెద్దమంచంమీద బిక్కు బిక్కుమంటూ తను ఒక్కర్తె వంటరితనంచేత సగం వాంఛతో సగం నిద్ర పట్టక పక్కమీద పొర్లాడేజానకి (నా భార్య) జ్ఞప్తికి వచ్చి అమాంతం లేవబోయాను. నేను లేవబోతూండగా రాధ తన పెదవులతో నాపెదవులమీద ఒకముద్ర వేసింది. విదళించుకుంటూ ఆమెవళ్ళోకి వరిగిపోయాను.

రాధ ప్రశ్నించింది. "యింటివద్ద భార్య జ్ఞాపకం వచ్చిందా ?"

నా మొహాన్ని నెత్తురుచుక్క లేదు. ముఖపై ఖరినిబట్టి స్త్రీ పురుషుణ్ణి ఎంత సులభంగానూ, సునాయాసంగానూ చదవగలదో!

"నీ ప్రణయజీవితంలో ప్రథమ సోపానాన్ని నేనా ఆమె? నా స్పర్శాదోషంవల్ల నీ కెట్టి ప్రమాదమూ సంభవించదులే!"

ఎంత మొరటుప్రశ్న - ఎంత ఘూతైన ఓదార్పు - ఆమె వికసితోత్పలనేత్రాల్లో చూడలేక కనురెప్పలను దించేసుకున్నాను.

"నేను నీకు అక్కర్లేదూ?" అని అడిగింది ఎంతో మృదువుగా.

ఆమె నాకు అక్కర్లేదూ? కావాలా? అక్కర్లేదా?

అక్కర్లేదూ? అభినయంలోనూ గానంలోనూ తనకి వున్న నైపుణితో కళాప్రపంచాన్ని ముగ్ధపరచిన కళాదేవత. పత్రికలవల్లనూ, ప్రజలవల్లనూ పొగడ్తలందిన తేజోరాశి. ప్రముఖుల మన్ననలూ, పెద్దలదీవనలూ అందుకొన్న పుణ్యమూర్తి. దేశాన్ని భ్రమింపజేసి మోహింపజేసి తనవైపుకి లాగుకొనవలసిన భువనమోహిని. తనంతట తాను అకారణంగా "నేను నీకు అక్కర్లేదా?" అని అడిగితే అక్కర్లేదనే నిర్భాగ్యుడెవడైనా వుంటాడా?

కావాలా? భ్రమరకీటక న్యాయంలా ఆమెతేజస్సులో పడి దగ్ధమైపోతానేమో! ఆమె వలపులో చిక్కి భార్యనీ సంసారాన్నీ అత్తమామల్నీ తలితండ్రుల్నీ అన్నీ మరచి

పోతానేమో ! అక్షలాదిగా ప్రజలను సంతృప్తిపరచ గలిగిన ఆమెసౌందర్యమూ చాతుర్యమూ ఒక్కని వలపులో చూపిందంటే....

ఇంకా ఆలోచిస్తున్నాను.

"నేను నీకు అక్కర్లేదులే ! నాకు తెలుసు ! నీకు జానకి వుండగా నేనెందుకు ?"

మాటలు తప్పించాను. "యీ యింటికి అద్దె ఎంత ?"

"అద్దెయిల్లు కాదు. స్వంతం. స్వార్జితం."

"ఎన్నివేలైంది కట్టించేందుకు ?"

"ఎంతయిందో ఎవరికి తెలుసు. ఆపురుషోత్తమరావుకి తెలియాలి."

"ఎవరో ఆ మహామహుడు ?"

"ఎవరైతే నీకెందుకు పోనిద్దూ"

అనుమానపడుతూ అసహ్యించుకుంటూ ఆమెవాళ్ళోంచి లేచాను. "నీచపుపనుల్లోకి కూడా దిగావా ?"

"నీచం అనగా ? భగవంతుడు నాకు తలితండ్రుల్నీ, ఆప్తుల్నీ, "నా" అన్నవారినీ ఎవ్వరినీ ఇవ్వలేదు. "అందం" ఒక్కటే ప్రసాదించాడు. ఆసౌందర్యాన్ని వ్యక్తిగతంగా వ్యక్తులకీ బాహుళ్యంమీద సంఘానికి యిచ్చి జీవిస్తున్నాను. ధనంతో సర్వసౌఖ్యాలూ కొంటాం. ఆధనంకోసమే యీ పోట్లన్నీ !"

"అందాన్ని అమ్మకుదేహాన్ని గుల్లచేసుకుంటావా?"

"అవును. ధనంకోసం."

"ధనమూ యౌవ్వనమూ శాశ్వతమా?"

"నువ్వు ప్రేమించిన ప్రేమ శాశ్వతమా ?"

సమాధానం చెప్పడానికి సంకోచించాను. వేటకాడి బాణానికి దెబ్బతిన్న లేడిలా చిక్కిపోయాను. రాధ కామినిలా కనిపించింది.

"ప్రేమ శాశ్వతమో అశాశ్వతమో వసంతసమయంలో నాహృదయాన్ని చిగురింపజేసి వుంటే యిద్దరమూ తెలుసుకునేవాళ్ళం. ఇప్పుడు నేను మోడునైపోయాను. యీ మోడులో నువ్వు ఎంత అమృతం పోసినా ప్రయోజనం లేదు. సున్నితమైన నా హృదయం మొగటు అయిపోవడంచేతనే నీలో నీచత్వాన్నేగాని, ఆకర్షణని గ్రహించలేకుండా వున్నాను. నీ దృష్టులలో ఎంతలోతు వుండేదో! నా హృదయంలోనూ అంతలోతు వుండేది. ఈ రెంటికీ సామరస్యం కుదిరివుంటే నీకు ప్రేమపాఠాలు నేర్పలేకపోయేవాణ్ణా ?"

"నువ్వు నన్నూ నా సౌందర్యాన్నీ యిప్పుడు కోరుతున్నావా ?"

"వద్దు. కోరడంలేదు....కోరను...."

"నేనే గెల్చాను. నువ్వే వోడావ్:"

"యీ జయాపజయాలు కాలగర్భంలోని తంత్రాలు"

వికటంగా వికృతంగా యిల్లు మారుమోగేటట్లు రాధ నవ్వింది.

(ఏప్రిల్—1939.)